# పరలోకవాసి

అది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయోలాజికల్ సైన్సెస్. సుమారు పదిహేను ఎకరాల ఆవరణ మధ్య నాలుగు అంతస్తుల సువిశాల భవనంలో ఉంది ఆసంస్థ. ప్రపంచ ప్రఖ్యాతిగొన్న ఆ సంస్థ అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిన ఎందరో జీవశాస్త్రజ్ఞులను తయారుచేసింది. అంతేకాదు ఆ సంస్థలో పనిచేస్తూ, ఉన్నత పదవుల మీద ఇతరదేశాలకు పోయి, అక్కడి పౌరసత్వం స్వీకరించిన కొందరు భారతీయ శాస్త్రజ్ఞులు, నోబెల్ బహుమతివంటి అత్యున్నత పురస్కారాలను పొందారు కూడా. ఆ సంస్థలో పనిచేయడంకాని, దానితో ఏవిధమైన సంబంధం కలిగి వుండడం కాని ఒక గౌరవంగా భావిస్తారు శాస్త్రజ్ఞులు. అంతటి మహోన్నత చరిత్ర కలిగినట్టిది ఆ సంస్థ.

ఎల్ ఆకారంలో ఉన్న ఆ బ్లాక్‌లో ఒక వింగ్‌లో లైబ్రరీ ఉంది. మరో వింగ్‌లో లేబొరేటరీలు ఉన్నాయి. ఈ రెండు విభాగాల్లోనూ నిరంతరం నిశ్శబ్దం తాండవిస్తూ ఉంటుంది. ఎవరిమటుకు వారు తదేక ధ్యాసతో లైబ్రరిలో చదువుకుంటుండడం కాని, దీక్షగా పరిశోధనలు జరుపుకుంటుండడం కాని చేస్తుంటారు. మాట్లాడవలసిన అవసరం వచ్చినపుడు నెమ్మదిగా ఇతరులకు డిస్ట్రబెన్స్ లేకుండా మాట్లాడుకుంటారు. ఈ రెండు చోట్లాకూడా ప్రశాంత గంభీర వాతావరణం నెలకొని ఉంటుంది ఎప్పుడూ. దూరంగా విడిగావున్న మరో బ్లాక్‌లో అడ్మినిస్ట్రేటివ్ వింగ్ ఉంది. పాలనకి సంబంధించిన వ్యవహారాలన్నీ ఆ ఆఫీసులో జరుగుతుంటాయి.

లైబ్రరీలో ఏదో సరికొత్త బయాలజీ పుస్తకాన్ని సీరియస్‌గా చదువుతోంది గీత. ఒక సందర్భంలో ఆమెకు ఏదో అనుమానం వచ్చింది. ఆనంద్ దగ్గరకువెళ్ళి ఆ అనుమానాన్ని నివృత్తి చేసుకోవాలనుకుంది ఆమె. వారిద్దరూ కూడా ఆ సంస్థలో డాక్టరేట్ పొందిన శాస్త్రజ్ఞులే. ఆనంద్ మంచి మేధావి. ఎటువంటి చిక్కు సమస్యనైనా సులువుగా వివరించగలడు.

గీత వెళ్ళేసరికి ఆనంద్ లాబొరేటరీలో తీవ్రంగా ఏదో పరిశోధనలో మునిగి ఉన్నాడు. పలకరిస్తే అతన్ని డిస్ట్రబ్ చేసినట్లు అవుతుందేమో అని, తటపటాయిస్తూ కొంచెం దూరంగానే నిలబడి పోయింది గీత.



పరిశోధనలో ఎంత గాఢంగా మునిగి వున్నా గీత రాకను గమనించాడు ఆనంద్. చేతిలో వున్న టెస్ట్ ట్యూబ్‌ను స్టాండ్‌లో పెట్టేస్తూ "రా గీతా, ఆగిపోయావే?" అంటూ ఆప్యాయంగా పలకరించాడు.

"పానకంలో పుడకలాగా పరిశోధన మధ్యలో అడ్డువస్తే, అయ్యగారికి అలకొస్తుందేమో నని ఆగిపోయాను". అంది గీత చిలిపిగా. వాళ్ళిద్దరూ సహశాస్త్రజ్ఞులే కాక వారి మధ్య ప్రేమానుబంధం వుంది. త్వరలోనే వివాహం కాబోతోంది వారికి.

"నా ఆలోచనల్లో కూడా పుడకలాగా అడ్డువస్తే, పరిశోధనని ఆపేశాను. ఆ.. ఇప్పుడు చెప్పు. ఏమిటీ సంగతి?" అన్నాడు ఆనంద్.

"జీవకణాలను లక్షలాది సంవత్సరాలు సజీవంగా ఉంచడం సాధ్యమా? నా ఉద్దేశం జీవితాన్ని లక్షలాది సంవత్సరాలు పెంచాలని కాదు, జీవాన్ని నిద్రాణస్థితిలోకి కాని మరే స్థితిలోకి కాని పంపి స్తంభింపజేసి, కొన్ని లక్షల సంవత్సరాల తర్వాత మళ్ళీ చైతన్యం పొందించడం సాధ్యమా? ఇందాక ఒక పుస్తకం చదువుతుంటే, భవిష్యత్తులో సైన్స్ సాధించగల విజయాలలో దీనిని కూడా ఒకటిగా పేర్కొన్నాడు రచయిత. దీని విషయంలో అనుమానం వచ్చి నిన్ను అడగటానికి వచ్చాను" అంది గీత.

"శాస్త్రరీత్యా ఇది సాధ్యమే. ఉదాహరణకి గింజల్నే తీసుకుందాం. ఆ గింజల్ని ఓ డబ్బాలో వేసి వుంచినంత కాలం అవి అలాగే ఉంటాయి. అంటే వాటిలో జీవం నిద్రాణ స్థితిలో ఉందన్నమాట. వాటిని

నేలలో పాతి నీరు పోసినప్పుడు అవి మొలకెత్తుతాయి. అంటే అనుకూల పరిస్థితులలో జీవం బహిర్గత మవుతుందన్నమాట. అయితే గింజలలో జీవం నిద్రాణస్థితిలో ఎంతకాలం ఉంటుందనే అంశం, ఆయా గింజల లక్షణాలపై ఆధారపడి ఉంటుంది. మొక్కల సంగతి సరే. కొన్ని కీటకాల సంగతే చూద్దాం. గొంగళిపురుగుల వంటి కీటకాలు ఆకుల్ని బాగామేసి, గూడు కట్టుకొని నిద్రపోతాయి. కొన్ని నెలల తర్వాత అందులోంచి సీతాకోకచిలుకలు బయటికి వస్తాయి. మరికొన్ని సూక్ష్మజీవుల, అల్పజీవాల సంగతి చూద్దాం. పరిస్థితులు అనుకూలంగా లేనపుడు, అంటే నీరు గడ్డకట్టే శీతలంలో కాని, మండుటెండలలో కాని, తమచుట్టూ ఒక కవచాన్ని ఏర్పరచుకొని దీర్ఘనిద్రలోకి వెళ్ళిపోతాయి. పరిస్థితులు తిరిగి అనుకూలించినప్పుడే అవి కవచాన్ని బ్రద్దలు కొట్టుకొని బయటకు వస్తాయి. ఇవి నిద్రావస్థలో ఉన్నప్పుడు అన్ని జీవవ్యాపారాలు పూర్తిగా స్తంభించి పోతాయి. మరి వాటికి తిరిగి జీవ చైతన్యం ఏ విధంగా వస్తోంది? దీనికి సమాధానం శాస్త్రవేత్తలకి ఇంకా అంతుపట్టనే లేదు."

"ఇవన్నీ నాకు తెలిసిన విషయాలే, నాకే కాదు. బయాలజీలో సామాన్య పరిజ్ఞానం ఉన్నవారికి కూడా తెలిసినవే. నా పాయింట్ నీకు సరిగా అర్థం అయినట్లు లేదు, కృత్రిమ గర్భోత్పత్తి కోసం పశువుల వీర్యాన్ని లిక్విడ్ నైట్రోజన్‌లో నిలువ ఉంచగలుగుతున్నాం కదా మనుష్యులలో స్త్రీ అండాన్ని తీసి టెస్ట్‌ట్యూబ్‌లో ఫెర్టిలైజ్ కావించి "టెస్ట్‌ట్యూబ్ బేబీస్"ను సృష్టించడం జరుగుతోంది కదా. అయితే ఈ రెండు సందర్భాలలోనూ జీవం చైతన్య వంతంగానే ఉంటుంది. దీనికి బదులు ఫలదీకరణం చెందిన అండంలోని జీవాన్ని నిద్రాణస్థితిలోకి పంపి కొన్ని లక్షల సంవత్సరాల తర్వాత దానికి చైతన్యం కల్పిస్తే ఎలా ఉంటుంది? అప్పటికి జీవ పరిణామం చాలా ఎక్కువగా జరిగి ఆ మానవుల రూపురేఖలే మారిపోవచ్చు. అటువంటి వారి మధ్య ఈ కొత్త జీవి ఎలా ఉంటుంది? అసలు ఇది సాధ్యమేనా?"

"ఏం... ఏమైనా సైన్స్ ఫిక్షన్ చదివావా ఏమిటి?" అన్నాడు ఆనంద్ నవ్వుతూ.

"సైన్స్ ఫిక్షన్ వ్రాసిన ఒక జీవశాస్త్రజ్ఞుడి వ్యాసాలు చదివాను. ఫలదీకరణం చెంది నిద్రాణంగా వున్న అండాల్ని ఇతర గ్రహాలకు కూడా పంపి మానవజాతిని అభివృద్ధి చేయవచ్చునని సూచించాడు ఆ రచయిత. అది ఊహే అయినా, శాస్త్రీయ పరంగా చాలా చక్కగా వివరించాడు ఆయన."

"అరే.... చాలా విచిత్రంగా ఉందే!" అన్నాడు ఆనంద్ ఆశ్చర్యంగా.

"ఏమిటి.... ఈ ఊహ"! ఆ సామాన్య ఊహ ఆనంద్‌కి ఆశ్చర్యం కలిగించినందుకు ఆశ్చర్యపోతూ అడిగింది గీత.

"ఊహకాదు. ఇప్పుడు నేను చేస్తున్న ప్రయోగానికీ, ఈ ఊహకీ పూర్తి సంబంధం ఉంది." అన్నాడు ఆనంద్.

"రియల్లీ.. ఇటీజ్ సింప్లీ వండర్‌ఫుల్" అంది గీత పట్టరాని ఆశ్చర్యంతో.

"ఇటీవల మన దేశం అంగారక గ్రహానికి మానవ రహిత అంతరిక్ష నౌకలను పంపింది కదా. అవి అక్కడి మట్టిని, శిలలను భూమికి తీసుకు వచ్చాయి కదా. వాటిలో కొన్నింటిని అంగారక గ్రహంలో ఇప్పుడు కాని, మునుపెప్పుడు కాని ఏ విధమైన జీవమైనా ఉందా అనే విషయం పరిశోధించడానికి మన ఇన్‌స్టిట్యూట్‌కి ఇచ్చారు. ఆ పరిశోధనలను నేను చేస్తున్నాను" అన్నాడు ఆనంద్.

"అవును. నాకు తెలుసు. పోతే ఇంతకు ముందు అమెరికన్లు పంపిన వైకింగ్ నౌకలు, రష్యా, మనదేశం వంటి దేశాలు పంపిన నౌకలు, అక్కడ ఏ విధమైన జీవం, కనీసం గడ్డికాని, ఆఖరికి సూక్ష్మజీవులు కాని లేవని నిరూపించాయి కదా."

"ఆ మాట నిజమే. అయితే ఒకప్పుడు అంగారకుని మీద జీవనదులు ప్రవహించిన దాఖలాలు ఉన్నాయి. అక్కడి వాతావరణంలో ఆక్సిజన్ ఉంది. గ్రహం మీద స్వల్పపరిమాణంలోనైనా నీరుంది, ఇప్పటికీ చైతన్య వంతంగా వున్న అగ్ని పర్వతాలున్నాయి అక్కడ. ఈ పరిస్థితులన్నీ అక్కడ జీవం ఆవిర్భవించడానికీ, పరిణామం చెందడానికీ అనుకూలమైన పరిస్థితులే.

"కాని..."

"మరి జీవం ఉన్నట్లు సాక్ష్యం ఎందుకు దొరకలేదూ అని నీ అనుమానం?"

అంగారకుని మీద పరిస్థితులు క్రమేపీ మారి ఏరకమైన జీవం ఉండడానికి ఆస్కారం లేకుండాపోయింది. అయితే ఒకప్పుడు అక్కడ జీవం ఉండిందనే నా నమ్మకం. నా నమ్మకమే కాదు చాలామంది శాస్త్రజ్ఞుల నమ్మకం కూడా. అయితే తొలిసారిగా అక్కడినుంచి మట్టిని, శిలలను తీసుకొనివచ్చింది ఇప్పుడే. అదికూడా మనదేశమే. ఇప్పుడు నేను జరుపుతున్న పరిశోధనలు నా నమ్మకాన్ని బలపరుస్తున్నాయి."

"నిజంగా?"

"అవును... ఇలారా..." అంటూ ఎక్స్‌పరిమెంటింగ్ టేబుల్ దగ్గరగా ఆమెను తీసుకువెళ్ళాడు ఆనంద్.

"ఇదుగో.... ఇవి అక్కడినుండి తెచ్చిన మట్టి, శిలల నమూనాలు. వీటిని పరీక్షిస్తే భూమిమీద నాలుగు కోట్ల సంవత్సరాలకి ముందు ఉండిన సూక్ష్మ జీవులు అక్కడకూడా ఉన్నట్లు ధ్రువపడ్తోంది.

అంతకన్నా అత్యంత విచిత్రమైనది ఇంకోటి ఉంది"

"ఏమిటది?"

"ఈ గ్లాస్ కేస్‌లో ఒక చిన్న భరిణ వంటిది ఉంది చూశావా"

"అవును....కనిపిస్తోంది?"

"ఎవరో మంచి పనితనం ఉన్న కళాకారుడు అందంగా చేసినట్లుగా ఉంది"

"అవునా...ఇది అంగారకుని నుంచి తెచ్చిన ఒక మట్టి పెళ్ళలో దొరికింది."

"అరే... ప్రకృతి సహజంగా ఎంత అందమైన భరిణ తయారయింది! ఎట్‌టైమ్స్ ట్రూత్ ఈజ్ మోర్ థ్రిల్లింగ్ దాన్‌ఫిక్షన్" అని సామెతఉంది. దీన్ని చూస్తే "ఇన్‌మెనీ కేసెస్-నేచర్ కెన్ ప్రొడ్యూస్ ఫార్ బెటర్ థింగ్స్ దాన్ మాన్" అని అనవచ్చేమో!"

"ఇది స్వాభావికంగా ఏర్పడిందని ఎందుకు అనుకుంటున్నావు?"

"మరి?" అంతులేని ఆశ్చర్యంతో అడిగింది గీత.

"ఈ భరిణ ఎవరో బుద్ధి జీవులు చేసినదే. ఇందులో ఫెర్టిలైజ్డ్ ఎగ్ ఉంది. భరిణలోపల పూర్తిగా ఎయిర్ టైట్ చేసి అది చెడిపోకుండా ఉంచారు. పరిస్థితులు అనుకూలంగా ఉంటే ఇది జీవం పొందగలదని నా నమ్మకం".

"వాట్ ఎ వండర్! అంటే ఇది ఒకప్పటి అంగారక గ్రహవాసులకి సంబంధించిన అండమన్న మాట."

"అని ఖాయంగా చెప్పలేను. ఎందుకంటే ఈ అండం మానవజాతి అండాన్ని పోలిఉంది. అంగారక గ్రహవాసులు మానవ జాతిని పోలివుండేవారో లేక అప్పటి భూవాసులు అంతరిక్ష నౌకల ద్వారా కావాలని మానవ అండాల్ని అక్కడికి పంపారో తేల్చుకోలేకపోతున్నాను"

"అదెలా సాధ్యం? అంతరిక్షశాస్త్రం అభివృద్ధి చెందింది ఇటీవల దశాబ్దాలలోనే కదా? అటువంటప్పుడు భూవాసులు అక్కడికి ఎలా పంపగలరు?"

"అంతరిక్ష శాస్త్రం ఇటీవలనే అభివృద్ధి చెందిందని మనం అనుకుంటున్నాం. కాని అది సరికాకపోవచ్చు. ఎందుకంటే మన భూమిమీద చరిత్రకి అందని బహు ప్రాచీన కాలంలోనే అతిగొప్ప నాగరికతలు విలసిల్లిన దాఖలాలున్నాయి. అవన్నీ నామరూపాలు లేకుండా తుడిచి పెట్టుకుపోయాయి. అట్టివారి విజ్ఞానం అంతరిక్షయానాన్ని సాధించి ఉండవచ్చుకూడా అంతదాకా ఎందుకు ఈజిప్టులోని పిరమిడ్లనే తీసుకుందాం. ఇంజనీరింగ్ ఇంతగా అభివృద్ధి చెందిన ఈ కాలంలో కూడా అటువంటి నిర్మాణాలను కట్టడం సాధ్యంకాదు. అలాగే ఢిల్లీలోని ఇనుప స్తంభమూను. మెటలర్జీలోని ఎన్ని మెలుకువలను ఉపయోగించినా అంతటి స్వచ్ఛమైన ఇనుమును తయారు చేయడం ఇప్పటికీ సాధ్యంకాదు. ఇటువంటివి ఈ భూమిమీద ఎన్నో ఉన్నాయి. విజ్ఞాన శాస్త్రంలో ఇట్టి విజయాలను సాధించిన పూర్వీకులకి అంతరిక్షయానం సాధ్యమై ఉండదని ఎందుకనుకోవాలి?"

"ఇవన్నీ భూవాసులు కట్టినవి కావని, ఇతర నక్షత్రమండలాలకు చెందిన బుద్ధిజీవులు భూమికి వచ్చారని, ఇవి వారి నిర్మాణాలనీ సిద్ధాంతీకరించిన గ్రంథం ఒకటి చదివాను.

"అవును నేనూ చదివాను. ఆవిధంగా భావించడానికి కొన్ని ఆధారాలున్నాయి. ఆ గ్రంథంలో ప్రతిపాదించిన దాని ప్రకారం ఈ బుద్ధిజీవులు "ప్లియైడ్స్" నక్షత్ర మండలం నుంచి వచ్చి ఉండాలి. కాని నేటి మన విజ్ఞానం ప్రకారం ఇది అసాధ్యం. ఎందుకంటే మనకి అతిసమీపంలో వున్న ఆల్ఫాసెంటరీ నక్షత్రం నుంచి సెకనుకి 1,86,000 మైళ్ళ వేగంతో ప్రయాణంచేసే కాంతే భూమిని చేరడానికి నాలుగు సంవత్సరాలుపడ్తుంది. ఐన్‌స్టీన్ సిద్ధాంతం ప్రకారం ఏ పదార్థము కాంతివేగాన్ని అందుకోలేదు. ఈ లెక్కన ఈ నక్షత్ర మండలం జేరడానికి, మనకి వున్న అత్యంతవేగంగా పోయే రాకెట్లను ఉపయోగించినా లక్షల సంవత్సరాలు పడ్తుంది. అయితే ఆ బుద్ధిజీవులు మనకంటే ఎంతగానో పరిణామం చెందినవారు కావడం వల్ల వేరే పద్ధతులలో దీనిని సుసాధ్యం చేసుకుని ఉండవచ్చు".

"ఆ లెక్కన అంతరిక్ష యానంలో వారి జీవవ్యాపారాల్ని స్థంభింపజేసుకుని భూమిని జేరాక తిరిగి చైతన్యం పొంది ఉండవచ్చుగా"

'క్వైట్ పాజిబుల్ ఈ విషయంలో మన అంతరిక్ష శాస్త్రజ్ఞులు పరిశోధనలు చేస్తున్నారు. కొందరు

శాస్త్రవేత్తల ఊహప్రకారం జీవం ఇతరలోకాల నుండి ఉల్కల ద్వారా కాని, మరేవిధంగా గాని భూమికి వచ్చి అభివృద్ధి చెందింది. ఈ ఊహే కనుక నిజమైతే పరలోక బుద్ధిజీవులు జీవం స్తంభింప చేసిన అండాల్ని తీసుకొచ్చి భూమి మీద కూడా ఉంచి ఉండవచ్చు."

"గతంలో ఈ భూమిమీద బాగా అభివృద్ధి చెందిన నాగరికతలు ఉండేవని చెప్పావు కదా. వారెవరైనా అంగారకుని మీదకి ఈ స్థితిలో వున్న అండాల్ని పంపి ఉండవచ్చుగా. ఇందాక ఈ మాట నువ్వే అన్నావు"

"నిజమే. అదీ నిజమే. ఈ అండాన్ని టెస్ట్ ట్యూబ్ బేబీస్ విషయంలో లాగా టెస్ట్ ట్యూబ్‌లో తగిన రసాయనాలలో వేసి ఉంచుతాను.. నా ఉద్దేశం ప్రకారం ఇది జీవ చైతన్యం పొందుతుంది. అదే జరిగితే దీనిని కృత్రిమమైన తల్లి గర్భంలో పెంచుతాను. అప్పుడు దీనిని గురించి స్పష్టమైన అవగాహన మనకి ఏర్పడుతుంది.

"ఇటీజ్ రియల్లీ థ్రిల్లింగ్" అంది గీత ఆశ్చర్యంతో.

"నా పరిశోధన విజయవంతం అయితే అంతరిక్ష యానంలో నూతనాధ్యాయం మొదలవుతుంది. భూవాసులుకూడా ఇతర గ్రహాలకే కాదు, నక్షత్రమండలాలకు కూడా యాత్రలు చేయగలరు. అప్పుడు "వసుధైక కుటుంబం" అన్న సూక్తికి బదులు "విశ్వైక కుటుంబం" అన్న సూక్తి ఆవిర్భవిస్తుంది" అన్నాడు ఆనంద్.

"విష్ యు బెస్ట్ ఆఫ్ లక్" అంది గీత.

"వై? యు సే విష్ అజ్ బెస్ట్ ఆఫ్ లక్.... అ...ఈ అండం కనుక జీవం పొందితే ఇందాకటి నీ ప్రశ్నకి సరైయైన సమాధానం లభిస్తుంది" అన్నాడు ఆనంద్.

అటు తర్వాత తన పరిశోధనలో నిమగ్నమైపోయాడు ఆనంద్. గీత తిరిగి లైబ్రరీకి వెళ్ళిపోయింది.

* * * *

రెండు రోజులు గడిచాయి.

గీత లైబ్రరీలో ఏవో పుస్తకాలు రిఫర్ చేస్తోంది.

ఆనంద్ వడివడిగా అడుగులు వేసుకుంటూ ఆమె వద్దకు వచ్చాడు.

మామూలుగా అయితే లైబ్రరీకి వచ్చే వాళ్ళు నెమ్మదిగా, శబ్దం చేయకుండా వస్తారు.

ఆనంద్ సంగతి సరేసరి. అటువంటిది ఆ రోజు అతను ఆ విధంగా రావడంతో ఆ అలికిడికి అటువైపు తిరిగి చూసింది గీత.

ఆమెను చూస్తూనే"గీతా...గీతా" అంటూ దగ్గరగా వచ్చాడు ఆనంద్.

ఆ కేకలకు ఇబ్బందిగా ముఖం పెట్టింది ఆమె. లైబ్రరీలో వున్న ఇతరుల మెడలుకూడా ఒక్కసారిగా అతనివైపు తిరిగాయి. గీత "సైలెన్స్ ప్లీజ్" అని వున్న బోర్డువంక వేలు చూపించింది.

అప్పుడు ఆనంద్ ఈ లోకంలోకి వచ్చాడు. తన ప్రవర్తనకి సిగ్గు పడుతూ గీతకి దగ్గరగా వచ్చి "ఒక్కసారి లేబొరేటరీలోకి రా" అన్నాడు.

గీత మౌనంగా ముందుకి సాగింది.

లాన్స్‌లోకి రాగానే "గీతా! మన ఎక్స్‌పెరిమెంట్ సక్సెస్‌ఫుల్ అయింది" అన్నాడు ఆనంద్ పట్టరాని సంతోషంతో.

"ఏదీ!...అంగారకుని శిలలో దొరికిన ఆ అండందా...?" అంది ఆమె ఆశ్చర్యంతో.

"అవును, అదే. ఆ అండానికి జీవచైతన్యం వచ్చింది. ఎంబ్రియోగా మారి ఎదుగుతోంది. మరో విషయం. దాని గ్రోత్ ఫెంటాస్టిక్‌గా ఉంది. మనుష్యుల ఎంబ్రియో కంటే ఎన్నోరెట్ల వేగంగా అది ఎదుగుతోంది. ఈ లెక్కన పూర్తి ఆకారం కొద్ది రోజుల్లోనే వస్తుందేమో అని అనిపిస్తోంది" అన్నాడు ఆనంద్.

"స్ట్రేంజ్" అని ఏదో ఆలోచిస్తూ వడివడిగా లేబొరేటరీలోకి దారితీసింది గీత. ఆమెకంటే ముందు అంగలు వేసుకుంటూ ఎక్స్‌పెరిమెంటల్ టేబుల్ దగ్గరికి వెళ్ళాడు ఆనంద్.

ఎక్స్‌పెరిమెంటల్ టేబుల్ మీద ఒక పెద్ద గ్లాస్ జార్ ఉంది. అందులో ఏదో ద్రవం ఉంది. ఆ జార్ మీద బిగుతుగా ఒక మూత ఉంది. దానికి రెండు రంధ్రాలున్నాయి. ఒక రంధ్రంలో ఉన్న ట్యూబ్ ఆక్సిజన్ సిలిండర్‌కి కనెక్ట్ చేసి ఉంది. మరో రంధ్రంలో ఉన్న గొట్టం, మరో జార్లో ఉన్న సున్నపు తేటలోకి ఉంది. ఈ మొత్తం ఏర్పాటు అంతా ఒక పెద్ద గ్లాసకేస్‌లో ఉంది. లోపల జార్‌లోని ద్రవంలో, తల్లి గర్భంలో రెండు నెలల వయసున్న పిండం యొక్క ఆకారం ఒకటి తేలుతూ కనిపిస్తోంది.

"ఇందులో...లోపలి జార్‌లో గర్భిణీ స్త్రీల గర్భాశయంలో ఉండేటటువంటి ద్రవాన్ని పిండానికి కావలసిన కొన్ని పోషక పదార్థాలను ఉంచాను. ఆక్సిజన్ సిలిండర్ ద్వారా పిండానికి ప్రాణవాయువు అందుతుంది. విడుదలయిన కార్బన్ డైఆక్సయిడ్ సున్నపు తేటలో కలిసి కాల్షియం కార్బోనేట్ లవణం అయి క్రిందకి దిగుతుంది. దీని ద్వారా శ్వాస ప్రక్రియ ఏ స్థాయిలో జరుగుతోందో తెలుసుకోవచ్చు. ఈ ఏర్పాటు వల్ల ఇతర వాతావరణ ప్రభావంకాని, సూక్ష్మజీవుల కంటామినేషన్‌కాని ఉండదు. నిన్న ఒక చిన్న బిందువుగా ఉన్న పిండం, ఈ రోజుకి అప్పుడే ఎంతగా ఎదిగి పోయిందో చూడు" అన్నాడు ఆనంద్.

"చాలా విచిత్రంగా ఉండేది. కళ్ళతో చూస్తున్నాం కనుక నమ్మాల్సి వస్తోంది కాని చూడకుంటే నమ్మశక్యం కాకుండా ఉంది. అది సరేకాని ఈ పిండం యొక్క శరీరం ఇలా ఉందేమిటి? గాజుపలకలాగా ట్రాన్స్‌పరెంట్‌గా ఉంది. ఆకారం మాత్రం మానవ పిండంలోనిదిగానే ఉంది".

"నిజమే. ఈ పిండ దేహ నిర్మాణం పూర్తిగా సెల్యులోజ్‌తో తయారయినట్లు అనిపిస్తోంది. సెల్యులోజ్‌కున్న విచిత్ర లక్షణం అది ఏ రూపాన్నయినా సంతరించుకోగలదు. ఆకారంబట్టి ఇది మానవ పిండం అనిపిస్తున్నా, ఈ లక్షణం చూస్తే ఈ జీవం మన భూమికి సంబంధించినది కాదేమోనని పిస్తోంది".

"ఏమైనా పిండం మరి కొంత ఎదిగేసరికి బహుశా అసలు సంగతి తెలియవచ్చు. ఇది పూర్తిగా ఎదిగి బ్రతకగలగాలేకాని, అనేక సృష్టి రహస్యాలు తెలియవచ్చు" అంది గీత.

"నేననుకోడం, ఇది పూర్తి ఆకారం చెందడానికి వారం పది రోజులు చాలు. ఈ పెరుగుదల వేగంకూడా, ఇది భూమికి సంబంధించిన ప్రాణికాదన్న అనుమానాన్ని బలపరుస్తోంది. అంగారకుడి మీది ఆకర్షణ శక్తి భూమ్యాకర్షణ శక్తికంటే బాగా తక్కువ. అందువల్ల సహజంగా అక్కడి జీవుల పెరుగుదల

భూమి మీదకంటే చాలా వేగంగా జరుగుతుంది" అన్నాడు ఆనంద్.

"అంటే అంగారక గ్రహం మీద ఉండిన బుద్ధిజీవులు తమ అద్భుత వైజ్ఞానిక ప్రగతితో ఈ విధంగా తమ సంతతిని దాచిపెట్టారంటావా? ఇప్పుడయితే ఎటువంటి జీవమూ అక్కడ లేదే" అంది గీత.

"మన భూమి మీద కూడా ఎన్నో గొప్ప నాగరికతలు వెల్లివిరిసి చివరికి నామ రూపాలు లేకుండా తుడిచిపెట్టుకుపోయాయని చెప్పానుకదా. అంగారక గ్రహంమీద కూడా అలాగే జరిగి ఉండవచ్చు. ఏ కారణం చేతనో ఆ గ్రహం నివాసయోగ్యం కాకుండా పోయి అన్ని రకాల జీవులూ పూర్తిగా అంతరించి ఉండవచ్చు. ప్రకృతి సహజమైన మార్పుల వల్ల జీవావశేషాలూ, నాగరికత చిహ్నాలూ అన్నీ అంగారక గర్భంలోకి వెళ్ళిపోయి ఉండవచ్చు. ఈ ప్రమాదాన్ని పసికట్టి ఆ లోకపు శాస్త్రజ్ఞులు ఈ విధంగా, ఫలదీకరణం చెందిన వారి జాతి పిండాల్ని నిశ్చేతన స్థితిలో భద్రపరచి ఉండవచ్చు. అంగారక గ్రహం చాలా ఎర్రగా ఉంటుందన్న విషయం నీకు తెలిసిందే గదా! అక్కడి నేలలో ఇనుము చాలా ఎక్కువగా ఉంది. అది క్రమేపీ అక్కడి వాతావరణంలోని ఆక్సిజన్‌ను ఇంచుమించు పీల్చివేసి ఐరన్ ఆక్సయిడ్‌గా మారిపోయింది. ఈ కారణం చేత అక్కడ జీవకోటి అంతరించి ఉండవచ్చని నా అనుమానం" అన్నాడు ఆనంద్.

"ఏమైనా కొద్ది రోజుల్లోనే ఈ విషమ సమస్య విడివడుతుందిగా లెటజ్ వెయిట్ అండ్‌సీ" అంది గీత.

"మరో ముఖ్య విషయం. ఈ విషయం ఎవ్వరికీ చెప్పొద్దు. మన ప్రయోగం విఫలం అయితే మనల్ని ఫూల్స్ క్రింద జమకట్టారు అందరూ. ఫలప్రదం అయిందా మోస్ట్ సెన్సేషనల్ న్యూస్‌క్రింద విడుదల చేయవచ్చు" అని హెచ్చరించాడు ఆనంద్.

"అవును ఆ విషయం నాకుమాత్రం తెలీదా" అంటూ సెలవు తీసుకొని వెళ్ళిపోయింది గీత.

* * * *

మర్నాడు అనుకోకుండా ఆఫీస్ డ్యూటీ మీద ఢిల్లీ వెళ్ళవలసి వచ్చింది గీతకి. తిరిగి వచ్చేసరికి పది రోజులుపట్టింది. అన్నాళ్ళూ ముళ్ళ మీద కూర్చున్నట్టే గడిపింది ఆమె. ఎక్కడున్నా ఆమె ఆలోచనలన్నీ ఆనంద్ జరుపుతున్న పరిశోధన మీదనే ఉన్నాయి. ఎప్పుడెప్పుడు వెళ్ళి ఆ జీవం ఏ విధంగా రూపొందిందో చూడాలన్న ఆరాటం ఆమెలో ప్రబలింది. తిరిగి రాగానే తిన్నగా ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్ళింది. అప్పటికి రాత్రి ఎనిమిది గంటలు అయింది. మామూలుగా ఆ సమయంలో అక్కడ ఎవరూ ఉండరు. ఏవైనా తీవ్రమైన, అత్యవసరమైన పరిశోధనలు చేస్తుంటే మాత్రం కొందరు శాస్త్రజ్ఞులు లాబొరేటరీలో ఉంటారు. రాగానే ఆనంద్ ఇంటికి ఫోన్ చేసింది గీత. ఒంటిరివాడైన అతని ఇంటినుంచి రెస్పాన్స్ రాకపోవడంతో, లాబొరేటరీలోనే ఉండి ఉంటాడని తిన్నగా అక్కడికి వెళ్ళింది గీత. అనుకున్నట్లుగానే లాబొరేటరీలో ఆనంద్ ఉండేచోట లైట్లు వెలుగుతూ కనిపించాయి. మెట్లెక్కుతూ "డాక్టర్ ఆనంద్ లోపల ఉన్నారా?" అని చౌకీదార్‌ని అడిగింది.

"ఉన్నారమ్మా. అసలు ఆయన ఇంటికే పోవడంలేదు. ఇక్కడే ఉంటున్నారు" అని సమాధానం చెప్పాడు చౌకీదార్.

ఉత్సాహంతో గబగబా మెట్లెక్కి వెళ్ళి లేబొరేటరీ హాల్‌లోకి ప్రవేశించింది గీత. ఆనంద్ కుర్చీలో కూర్చుని ఏదో సీరియస్‌గా ఆలోచిస్తున్నాడు. వెనకాలే వెళ్ళి "హలో ఆనంద్" అంటూ భుజాలు పట్టుకుంది.

ఉలిక్కిపడి వెనక్కి తిరిగాడు ఆనంద్.

అతన్ని చూస్తూనే ఒక్కసారి భయంతో వెనుకంజ వేసింది గీత.

ఆనంద్ ముఖం బాగా పాలిపోయి ఉంది. ఒళ్ళు కూడా బాగా వడలిపోయినట్లుంది.

"ఆనంద్...ఏమిటి ఇలా ఉన్నావు? ఆరోగ్యం బాగాలేదా?" అని అడిగింది గీత ఆందోళనగా. ఆనంద్ ఏమీ మాట్లాడలేదు. కొంచెంసేపు ఆమెవంక నిశితంగా చూస్తుండిపోయాడు.

అతను అలా చూడడం గీతకి ఏమిటోగా అనిపించింది. ముఖ్యంగా అతని కళ్ళల్లోకి చూస్తుంటే, చెప్పలేని భయం అనిపించింది. ఏదో అనాలని, ఏవో అడగాలని అనుకొని కూడా ఏమీ చేయలేక ఊరుకుండిపోయింది.

కొంచెంసేపు తేరిపార చూశాక ఆనంద్ "సారీ గీతా.... ఏమీ లేదు. ఈ ఎక్స్‌పెరిమెంట్‌తో చాలా అలిసిపోయాను. అందుకే అలా ప్రవర్తించాను. ఏమీ అనుకోకు" అన్నాడు.

"మైగాడ్. నీ అవతారం చూస్తే, నువ్వు మాట్లాడకపోయేసరికీ, ఏమైందోననీ భయపడి చచ్చాను. థాంక్‌గాడ్. ఇంతకీ నీ ఎక్స్‌పెరిమెంట్ ఏమైంది?" అని అడిగింది గీత.

"సక్సెస్‌ఫుల్. మనం ఊహించినట్లు ఆ జీవి అంగారక గ్రహానికి చెందినదే. ఆ పిండం వారం రోజులలోనే పూర్తి వ్యక్తిగా మారింది అంతేకాదు. అద్భుతమైన శక్తితో, నా మెదడులో నిక్షిప్తమైన విజ్ఞానాన్ని, ఆలోచనలను, ఆఖరికి మన భాషను కూడా తృటిలో గ్రహించాడు. మన భాషలో, నాతో తన చరిత్రను కూడా చెప్పాడు" అన్నాడు ఆనంద్.

"వండర్‌ఫుల్..... ఏడీ ఎక్కడున్నాడు అతను?" అంది గీత ఉత్సుకతతో.

"ప్రస్తుతం ఇక్కడలేడు. వివరాలన్నీ రేపు చెప్తాను" అన్నాడు ఆనంద్.

"పోనీ...అతని కథ ఏదో చెప్పాడన్నావు. అదైనా చెప్తావా?" అంది గీత కొంత నిరుత్సాహంతో.

"అలాగే. కొన్ని కోట్ల సంవత్సరాల క్రిందట మన భూమీ, అంగారకుడూ కలిసే ఉండేవట. అప్పుడు ఈ బృహద్గోళం మీద ఎంతో గొప్ప పరిణామం చెందిన నాగరికత గల మనుషులు ఉండేవారట. ఒకసారి ఈ గోళగర్భంలో బ్రహ్మాండమైన ప్రేలుడు సంభవించి ఒక ముక్క అంతరిక్షంలోకి విసిరివేయబడిందట. అదే అంగారక గ్రహంగా మారిందట. మన శాస్త్రజ్ఞులు కొంతమంది భూమీ, అంగారకుడూ, చంద్రుడూ ఒకప్పుడు కలిసి ఉండేవని భావించారు. భూమికీ, అంగారకుడికీ దిన పరిమాణం ఒక్కటే. ఇంకా ఎన్నో పోలికలూ ఉన్నాయి. ఈ ఊహ నిజమేనని ఆ అంగారక గ్రహజీవి చెప్పిన మాటలు ధ్రువపరుస్తున్నాయి"

"నువ్విలా అంటుంటే నాకో విషయం గుర్తుకి వస్తోంది మనం చదివే నవగ్రహస్తోత్రంలో అంగారకుని ధరణీ గర్భ సంభూతం" అనీ "భౌమ్య" అనీ "కుజుడు" అనీ పేర్కొనడం జరిగింది. ఈ మాటల అర్థం అంగారకుడు భూమినుంచి ఉద్భవించాడని. అంటే ప్రాచీన భారతీయులకి ఈ విషయం తెలుసన్న మాట" అంది గీత.

"ప్రాచీన భారతీయులు చెప్పిన ఎన్నో విషయాలు ఈనాటి శాస్త్రజ్ఞులు కనుగొంటూనేఉన్నారు".

"అది సరే. ఆ గ్రహ వాసి ఇంకేమి చెప్పాడు?"

"అదే చెప్పొస్తున్నాను. భూగర్భంలో కరిగిన ఇనుము ఎక్కువ ఉంటుందని నీకు తెల్సుగా. భూగర్భంలో ప్రేలుడు సంభవించి అంగారకుడు విడిపోయినప్పుడు, ఈ ఇనుము చాలా పెద్ద మొత్తంలో అంగారక గ్రహం మీద పడింది. క్రమేపీ, ఈ ఇనుము గ్రహంపైన బాగా వ్యాపించింది. అది గాలిలో ఉన్న నీటి ఆవిరిమూలంగా, వాతావరణంలోని ఆక్సిజన్‌ను క్రమక్రమంగా పీల్చి వేయసాగింది. చివరికి అంగారక గ్రహం నివాసయోగ్యం కాకుండా పోయింది. అక్కడ ఉన్న సకల జీవజాలమూ నశించింది. ప్రకృతి సహజమైన మార్పుల మూలంగా కొన్ని కోట్ల సంవత్సరాలకి వాటి అవశేషాలు కూడా పైకి కనిపించకుండా పోయాయి. అంగారకుని నేలలో తగు మాత్రం తవ్వితే అక్కడ జీవావశేషాలే కాకుండా అప్పటి వారి నగరాలను, నిర్మాణాలను కూడా కనుగొనవచ్చు. రానున్న ప్రమాదాన్ని గుర్తించిన అక్కడి శాస్త్రజ్ఞులు వారి జాతి ఫెర్టిలైజ్ ఎగ్స్‌ను ఈ విధంగా భద్రపరిచారు. భూమివంటి అనుకూల పరిస్థితులు ఉండే గ్రహాల మీద, వాటికి స్పందన కల్పిస్తే తిరిగి వారి జాతి వృద్ధిచెందగలదన్నమాట."

"ఒక్క విషయం. ఇంతటి అద్భుతమైన వైజ్ఞానిక ప్రగతిని సాధించిన అంగారక గ్రహవాసులు, ఇతర గ్రహాల మీదికి వలసపోయివుండవచ్చుగా?"

"ఆ విషయం కూడా చెప్పాడు అతను. ఒకప్పుడు అంగారకుడికీ, బృహస్పతికీ మధ్య ఒక పెద్ద గ్రహం ఉండేదట భూమి వంటి పరిస్థితులు కలిగిన ఆ గ్రహం మీదకి అక్కడివారు వలసపోయారట. అయితే వారి నాగరికత, విజ్ఞానం వెర్రితలలు వేయడంతో విభిన్నవర్గాల మధ్య ద్వేషాసూయలు ప్రబలడంతో, పరస్పరం అణుబాంబులు ప్రయోగించుకోవడంతో, ఆ గ్రహం ముక్కలు ముక్కలుగా ప్రేలిపోయి, వారి నాగరికత, జాతి అంతరించాయట.

"అరే. ఈ విషయం మన ఖగోళ శాస్త్రజ్ఞులు కూడా అంటున్నదే. ఒక్కప్పుడు అంగారక, గురుగ్రహాల మధ్య ఉండిన ఒకగ్రహం ముక్కలు అయిపోయి ఆస్టిరాయిడ్స్ అని మనం పిలిచే అల్పగ్రహాలుగా మారిపోయిందని, బోడ్‌వంటి శాస్త్రజ్ఞులు శాస్త్రీయంగా నిరూపించారు. అయితే ఈ నాగరికత విషయం ఎవరికీ తెలియదు".

"సరిగ్గా చెప్పావు. ఇప్పుడీ వ్యక్తి చెప్పకపోతే మనకీ తెలిసేది కాదు. వారు అద్భుతమైన వైజ్ఞానిక ప్రగతిని సాధించడంతో, ఇతరుల విజ్ఞానాన్ని, భాషలను కేవలం మేధాశక్తి తరంగాల మార్పిడి మూలంగా గ్రహించగలిగే ప్రక్రియను కనుగొన్నారు. అందుకే అతను నాకీ విషయాలన్నీ మన భాషలో చెప్పగలిగాడు.

"ఆ అద్భుత వ్యక్తిని చూడాలని నాకు ఎంతో ఆరాటంగా ఉంది అంది గీత.

"సరే. చూద్దుగాని. ఉండు ఇప్పుడే వస్తాను" అంటూ దగ్గర్లో వున్న ఒక గదిలోకి వెళ్ళాడు ఆనంద్. మరో ఐదు నిమిషాలలో బరువైన ఒక బస్తాను భుజాల మీద పెట్టుకొని బయటకు వచ్చాడు.

ఆశ్చర్యంతోనూ, చెప్పలేని ఆందోళనతోనూ, తెలియని భయంతోనూ ఆ మూటవైపు చూసింది గీత.

"ఏం...అంగారక గ్రహవాసిని చంపి ఈ బస్తాలో వేసి తెచ్చాననుకొన్నావా?" అంటూ చిలిపిగా నవ్వాడు ఆనంద్. ఆ సమయంలో అతని నవ్వుకూడా గీతకి భయాన్ని కల్పించింది. ఆమె ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయింది.

"అదేం కాదు. ఆ అంగారక గ్రహవాసి ఇక్కడ లేడు. మరోచోట ఉన్నాడు. మనం ఇప్పుడు అక్కడికే వెళ్తున్నాం. ఈ సంచీలో కొన్ని పరికరాలు ఉన్నాయి" అంటూ ముందుకు సాగాడు ఆనంద్.

మౌనంగా అతనిని అనుసరించింది గీత.

గారేజ్ దగ్గరకు వెళ్ళి మూటని క్రిందకు దింపాడు ఆనంద్. లోపల్నుంచి కారును బయటకు తీసుకు వచ్చాడు. డిక్కీ తెరిచి అందులో ఆ మూటను ఉంచాడు. తాను లోపల స్టీరింగ్ దగ్గర కూర్చుని, "కమాన్' అని గీతను పిలిచాడు. తలుపు తెరిచి గీత వెళ్ళి అతని ప్రక్కనే కూర్చుంది.

కారు జోరుగా సాగిపోతోంది.ఏవేవో ఆలోచనలతో మనసు నిమగ్నమై ఉన్న గీత ఏమీ మాట్లాడకుండా కూర్చుంది. మధ్య మధ్య ఆనంద్ తనవంక నిశితంగా ఓరచూపులు చూస్తుండడం గమనించింది.

కొంచెం సేపట్లో ఆనంద్ కారు ఊరిపొలిమేరలు దాటింది.

"ఆనంద్...మనం ఎక్కడికి వెళ్తున్నాం?"అంది గీత తెలియని భయంతో.

"నువ్వు ఇంతకు ముందెప్పుడూ చూడని చోటికి వెళ్తున్నాం. ఎక్కడికో ఇప్పుడే చెప్పేస్తే ఎలా? కొంచెం సస్పెన్స్ ఉండొద్దూ?" అంటూ కారు వేగం పెంచాడు.

ఆనంద్ సాధారణంగా గంభీరంగా ఉంటాడు. సరదాగా మాట్లాడేటప్పుడు కూడా సూటిగా మాట్లాడుతాడు. పరిశోధన ఫలించిందన్న ఉత్సాహంతోనో యేమో, ఈ రోజు సస్పెన్స్ మొదలుపెట్టాడు.

అతను ఆ విధంగా మాట్లాడడం గీతకు నచ్చలేదు. నిశ్శబ్దంగా ఉండిపోయింది. మరో అరగంటలో కారు రోడ్డుకి కొంచెం దూరంలో ఉన్న ఒక పాడుబడ్డ బంగాళా ముందు ఆగింది. ఆనంద్ దిగి మెట్లెక్కి తలుపుకి ఉన్న తాళం తీయసాగాడు.

గీత ఒక్కసారి నలువైపులా కలియజూసింది. ఎటుచూసినా నిర్మానుష్యం. చుట్టుప్రక్కల కనుచూపు మేరలో ఒక్క గుడిసె కూడా లేదు. కీచురాళ్ళ అరుపులు. ఆ వాతావరణం, పరిసరాలు ఆమె గుండెల్ని అవియజేస్తున్నాయి. అయితే అది వెన్నెల రాత్రి కావడంతో కొంతలో కొంతనయంగా ఉంది. తెలియని భయం ఆమెని ఆవహించింది. అయితే ఆనంద్ దగ్గరే వున్నందుకు కొంత ధైర్యం తెచ్చుకుంది.

ఆనంద్ టార్చిలైట్ సాయంతో తాళం తీసి తిరిగి కారు దగ్గరకు వచ్చాడు. డిక్కీని తెరిచి అందులోని మూటని బయటకు తీశాడు. డిక్కీని తిరిగి మూసి, ఆ మూటని భుజానికి యెత్తుకుని "రా...లోపలికి" అంటూ ముందుకి సాగాడు.

భయం భయంగా, మౌనంగా అతన్ని అనుసరించింది గీత.

లోపలికి వెళ్ళాక భయంతో పిడచకట్టుకుపోయిన నాలుకతో "ఆనంద్ ఏమిటిదంతా? మనం ఇప్పుడెక్కడున్నాం?" అంది గీత.

"భయపడకు. ఇదీ నా లేబొరేటరీయే. అంగారక గ్రహవాసి అక్కడ ఉంటే ఇతరుల కంటపడ్తాడని, ఇక్కడికి మార్చాను. అతన్ని చూద్దుగానిరా పైగా నీకు ఎన్నో విషయాలు చెప్పాలి" అంటూ ఆమె చేయి పుచ్చుకొని నడవసాగాడు.

ఎప్పుడూ అతని స్పర్శతో పులకరించే గీతకి, ఆ క్షణంలో అతని స్పర్శ భరించలేనిదిగా అనిపించింది. వంటి మీద వందలాది గొంగళి పురుగులు పాకుతున్నట్లనిపించింది. పైకి ఏమీ అనలేక ఆవేదనను మూగగా భరించింది.

ఉన్నట్లుండి ఆనంద్ ప్రవర్తనలో మార్పు వచ్చింది. అకస్మాత్తుగా అతను గీతను ప్రక్కనే ఉన్న స్తంభానికి అదిమిపట్టి, అక్కడే వున్న త్రాడుతో ఆ స్తంభానికి కట్టేశాడు.

భయంతో గీత పై ప్రాణాలు పైనే పోయాయి. అమిత భయంతో అరవలేకపోయింది. కాళ్ళూచేతులూ కదపలేకపోయింది.

"భయంగా ఉంది కదూ ఇదీ 'సస్పెన్స్'లో భాగమే" అంటూ ఆమెవంక నిశితంగా చూశాడు ఆనంద్.

అతని చూపులను భరించలేకపోయింది గీత. ఆ కళ్ళు చూస్తుంటే ఏదో పాతాళలోకపు లోతులు కనిపిస్తున్నాయి. ఆ కళ్ళల్లో ఎప్పుడూ వుండే ప్రేమ, అనురాగం లేవు. క్రౌర్యం, ఆవేశం గూడుకట్టుకొని ఉన్నాయి.

"ఇలాగే ఉండు. ఇప్పుడే వస్తాను" అంటూ టార్చితో దారి చూసుకొంటూ వడివడిగా ఆ మూటను ఈడ్చుకుంటూ దూరంగా వున్న ఒక గదిలోకి తీసుకువెళ్ళాడు. ఆ తర్వాత కొంచెం సేపటికి బయటకు వచ్చి తలుపుకి గొళ్ళెం పెట్టాడు. వడివడిగా నడుచుకుంటూ, గీత వైపు విషపు నవ్వుతో చూస్తూ బయటకు వెళ్ళిపోయాడు. బయట తలుపుకి తాళం వేసినట్లూ, ఆ తర్వాత కారులో వెళ్లినట్లూ శబ్దాలు వినిపించాయి.

అప్పటికి కొంచెం తేరుకొంది గీత. ఆనంద్ ప్రవర్తన ఆమెకి ఏమీ అర్థం కాలేదు. కొంపతీసి అంగారక గ్రహవాసి అతన్ని హిప్నటైజ్ చేయలేదుకదా? అనిపించింది. ఆ ఆలోచన రావడంతో ఆమె శరీరం భయంతో గజగజ వణికిపోయింది. ఈ పరిస్థితిలో ఆనంద్ తనని ఏమి చెయ్యదలుచకున్నాడో, ఏమి చేస్తాడోనని బెదిరిపోయింది. ముందు ఇక్కడ నుంచి బయటపడాలనుకుంది. కాని ఎలా?

ఆనంద్ గీతను చేతులమీదుగా త్రాటిని పోనిచ్చి స్తంభానికి గట్టిగా కట్టి ఉంచాడు. చేతులు అటూ ఇటూ కదలగలుగుతున్నాయేకాని, ముడి స్తంభంవెనుకవైపున ఉండడంతో, దానిని విప్పడం అసాధ్యం. తాడు గట్టిగా ఉండడంతో చేతుల్ని కదిపి, ఒళ్ళు విదిలించీ తెంపడం కూడా అసాధ్యం.

ఏమి చేయాలో అని ఆలోచిస్తున్న గీత మస్తిష్కంలో ఒక ఆలోచన మెరిసింది. ఆమె కోటుజేబులో లైటర్ ఉంది. లేబొరేటరీలో ఎక్స్‌పెరిమెంట్స్ చేసేటప్పుడు తరచుగా బర్నర్స్ వెలిగించవలసి రావడం పరిపాటే. అందువల్ల వీలుగా ఉండడం కోసం సైంటిస్ట్‌లు తమ ఓవరాల్ పాకెట్‌లో లైటర్‌ను ఉంచుకుంటుంటారు. లైటర్ సంగతి జ్ఞాపకానికి రాగానే ఆమె దానిని తీసి వెలిగించి తనని కట్టి వేసిన తాడు క్రింద ఉంచింది. నిమిషంలో ఆ త్రాడు కాలి తెగిపోయింది. గీత కట్లు విప్పుకుంది. బయట

గుమ్మం దగ్గరికి పరిగెత్తింది. తలుపు లాగితే రాలేదు. ఆనంద్ బయట తాళం వేసుకొని వెళ్ళిన విషయం జ్ఞాపకం వచ్చింది. "ఈ దయ్యాల కొంపలోంచి బయట పడడం ఎలాగా?" అని ఆలోచిస్తున్న గీతకి, ఆనంద్ తన వెంట తెచ్చిన మూట విషయం జ్ఞప్తికి వచ్చింది.

"అందులో ఏముండి ఉంటుంది? ఆ అంగారక గ్రహవాసి చచ్చిపోతేనో, లేక అతన్ని చంపో, ఆనంద్ ఆ మూటలో పెట్టలేదు కదా? ఆ మూటలో ఏదో పరికరాలు ఉన్నాయని అతను అన్నమాట ఆమెకి నిజం అనిపించలేదు. అప్పటివరకూ ఆ అంగారక గ్రహవాసిని తనకు చూపించకపోవడం ఆమె అనుమానాల్ని బలపరిచింది. ఎలాగో బయటకిపోయేది లేదు కనుక, ఆ మూట రహస్యం ఏదో తేల్చుకోవాలనుకుంది.

లైటర్ సహాయంతో దారి చూసుకుంటూ ఆనంద్ మూటను తీసుకుని వెళ్ళిన వైపుకి వెళ్ళింది గీత. ఆ మూలగా ఒక చిన్న గది, దాని తలుపులకు గొళ్ళెం పెట్టి ఉండడం కనిపించింది. నెమ్మదిగా ఆ గొళ్ళెం తీసి ఆ గదిలోకి ప్రవేశించింది. గదిలో ఏమీ కనిపించలేదు. తాను వేరే గదిలోకి వచ్చిందేమో ననుకుంటూ మళ్ళీ గదంతా కలియజూసింది. ఒక మూల నేలమీద మూత కనిపించాయి. వెంటనే అక్కడికి వెళ్ళి ఆ మూతని పైకెత్తింది. క్రింద సెల్లార్, దానిలోనికి పోడానికి మెట్లు కనిపించింది. మెట్లు దిగి లైటర్ వెలుగులో నలువైపులా చూసింది. ఎదురుగుండా కనిపించిన దృశ్యం చూసి కొయ్యబారిపోయింది.

ఎదురుగుండా ఒక స్తంభానికి ఆనంద్ త్రాటితో కట్టబడి వున్నాడు. స్పృహ కోల్పోయిన స్థితిలో అతని తల ప్రక్కకి వాలిపోయి ఉంది.

"ఇదేమిటి? ఆనంద్ ఇప్పుడేగా బయటికి వెళ్ళాడు. ఇంతలో అతన్ని ఎవరు ఈ స్థితిలో ఇక్కడ పడేశారు?" అని ఆశ్చర్యపోయింది. అసలు ఇతను ఆనందేనా అన్న అనుమానం వచ్చి నఖశిఖ పర్యంతం పరీక్షగా చూసింది. అతనికి కొంచెం ప్రక్కగా లేబొరేటరీ నుంచి ఆనంద్ మోసుకొచ్చిన సంచీ ఖాళీగా పడి ఉంది.

"అయితే ఆ సంచీలో తెచ్చింది ఇతనన్నమాట అయితే అతను ఎవరు? నకిలీ ఆనందా? అలాగయితే ఎవరు అసలు? ఎవరు నకలు?"-లేబొరేటరీలో ఆ సాయంత్రం కలిసినప్పటినుంచి, ఇక్కడికి వచ్చేవరకూ తన వెంట వచ్చిన ఆనంద్ ప్రవర్తన జ్ఞాపకానికి వచ్చింది గీతకి అతనే నకిలీ ఆనంద్ అయ్యుండాలి. ఇక్కడ వున్న వాడు నిజమైన ఆనంద్ అయి ఉండాలి. అనుమాన నివృత్తి కోసం అతని దగ్గరకు వెళ్ళి కదుపుతూ "ఆనంద్... ఆనంద్" అంటూ పిలిచింది.

ఆనంద్‌కి శ్వాస ఆడుతూనే ఉంది. కాని స్పృహలో లేదు.

గీతకి ఎప్పుడూ దగ్గర ఇన్‌హేలర్ ఉంచుకొని మధ్య మధ్య పీలుస్తుండడం అలవాటు. వెంటనే ఇన్‌హేలర్ తీసి ఆనంద్ ముక్కు దగ్గర పెట్టింది.

కొంచెం సేపట్లోనే ఆనంద్‌కి తెలివి వచ్చింది. గీతను చూసి "గీతా నువ్వా...ఇక్కడున్నావా? వాడు నిన్నేం చెయ్యలేదుకదా?" అన్నాడు.

అతని కళ్ళలోకి సూటిగా చూసింది గీత. "సందేహంలేదు. ఇతనే నిజమైన ఆనంద్" అనుకుంది.

"మాటలు తర్వాత ముందు మనం ఇక్కడినుంచి బయట పడాలి" అంటూ ఆనంద్ కట్లు విప్పింది.

ఇద్దరూ మెట్లెక్కబోతుండగా పైన అడుగుల చప్పుడు వినిపించింది.

"వాడొస్తున్నట్లున్నాడు పద. ఈ ప్రక్కన దాక్కుందాం" అంటూ ఆ గదికి ప్రక్కవున్న ఒక హాలులోకి దారి తీశాడు ఆనంద్ గీత చేయిపుచ్చుకొని.

ఆ హాలులో గోడవారగా వెదురుబుట్టలలో యాసిడ్ సీసాలు ఉన్నాయి. వాటి వారగా నిలబడ్డారు వాళ్ళిద్దరూ. లైటర్‌ను ఆర్పేసింది గీత.

సెల్లార్ గదిలో ఒక వ్యక్తి తిరగాడుతున్న శబ్దం, టార్చి కాంతి అటూ ఇటూ ప్రవర్తిస్తున్న దృశ్యం ఆ నకిలీ ఆనంద్, అసలు ఆనంద్ కోసం వెతుకుతున్నట్లు చెప్తున్నాయి.

కొంచెం చేపట్లో ఆ వ్యక్తి వారు దాగున్న హాలులోకి వచ్చాడు. టార్చిలైట్‌ను అన్నివైపులకీ ప్రసరించాడు. గోడ మీద పడి ప్రతిఫలించిన స్వల్పకాంతిలోనే నకిలీ ఆనంద్ ముఖం అతి భీకరంగా కనిపిస్తోంది. ఇప్పుడు అతనికి ఆనంద్ రూపం లేదు. ఔట్‌లైన్ మానవ రూపాన్ని పోలివున్నా, ఆకారం మాత్రం ఏదో వింతగా ఉంది.

వాళ్ళిద్దరూ అతని కంట పడనే పడ్డారు. "ఓ ఇక్కడున్నారా? గీతా... నువ్వు విడిపించుకోవడమే కాకుండా ఆనంద్‌ని కూడా విడిపించావన్నమాట. బాగుంది. కాని ఇప్పుడెక్కడకి పోతారు?" అంటూ వారి వైపు రాసాగింది ఆ ఆకారం.

'రాకు...అక్కడే ఉండు" అని గట్టిగా అరిచాడు ఆనంద్.

అయినా అతను ముందుకు వస్తూనే ఉన్నాడు. ఏం చేయాలో, ఎలా తప్పించుకోవాలో అర్థం కాలేదు అతనికి. అతని దగ్గర ఏవిధమైన ఆయుధం లేదు. దగ్గర్లో కనీసం ఒక కర్రన్నాలేదు.

ఆ ఆకారం దగ్గరకి వచ్చేసింది. కసివెళ్ళగక్కుతున్న చూపులతో వాళ్ళిద్దర్నీ పట్టుకోడానికి చేతులు సాచింది.

భయంతో అటూ ఇటూ చూశాడు ఆనంద్. అకస్మాత్తుగా ఆనంద్ మస్తిష్కంలో ఒక మెరుపు మెరిసింది. ప్రక్కనే వున్న ఆసిడ్ సీసాను బలంగా ఆ వ్యక్తిమీదకు విసిరాడు. సీసా క్రిందపడి పగిలియాసిడ్ వలికి ఆ వ్యక్తిముందు ప్రవహించసాగింది. పొగలుకక్కుతున్న నైట్రిక్ ఆసిడ్ వాసనతో హాలు నిండిపోయింది.

ఆ యాసిడ్ ఆ వ్యక్తి పాదాలకు తగిలిందో లేదో, అతను వెర్రికేక వేసి కుప్పగా కూలిపోయాడు. ఏమి జరిగిందోనని లైటర్ వెలిగించింది గీత.

ఆ వ్యక్తి శరీరం చూస్తుండగా యాసిడ్‌లో కరిగిపోయింది.

వెంటనే పరుగు పరుగున ఆ ఇంట్లో నుంచి బయటపడి స్వచ్ఛమైన చల్లని గాలిని పీల్చుకోసాగారు. ఆ తర్వాత కారులో తన ఇంటికి బయలుదేరాడు ఆనంద్.

ఇంటికి వెళ్ళాక జరిగిందంతా వివరంగా చెప్పాడు ఆనంద్.

"అంగారక గ్రహం మీద ఆకర్షణశక్తి భూమ్యాకర్షణ శక్తికంటే బాగా తక్కువ. వాతావరణం కూడా బాగా తక్కువే. ఈ కారణాలచేత అక్కడి జీవుల పెరుగుదల అతివేగంగా జరుగుతుంది. దీనికితోడు

ఏనాటికైనా తమ జాతి తిరిగి వృద్ధిచెందాలన్న దృఢదీక్షతో, అద్భుతమైన వైజ్ఞానిక ప్రగతిని సాధించిన అంగారక గ్రహవాసులు తమజాతి సజీవ అండాన్ని నిద్రాణస్థితిలో భద్రపరచగలగడమే కాక, మందుల సారాన్ని మనం కాప్స్యూల్స్‌లో నింపినట్లు, వారి జాతి జీవలక్షణాలనూ, విజ్ఞానాన్ని కూడా, ఈ అండంలోని జీన్స్‌లో సంకేతాల రూపంలో ఉంచగలిగారు. దీనివల్ల ఏమవుతుందంటే, అనుకూల పరిస్థితులలో ఆ అండం అతిత్వరలో పూర్తి ఆకారాన్ని పొందడమే కాక విజ్ఞానాన్ని జీర్ణించుకున్న పరిపూర్ణ అంగారక గ్రహవాసిగా మారగలదు. ప్రతి మనిషి మస్తిష్కం నుంచీ, జీవ విద్యుత్ తరంగాలు వెలువడుతుంటాయి. మెదడులో ఆలోచనలు, జ్ఞాపకాలు, తెలివితేటలు ఇవన్నీ సంకేతాల రూపంలో ఉంటాయి. వెలువడినప్పుడు తరంగాల రూపంలో బయటికి వస్తాయి. ఈ తరంగాలను తమ మెదడుద్వారా గ్రహించి ఎదుటివారి విజ్ఞానాన్ని జ్ఞాపకాలనీ, ఆలోచనలనీ గ్రహించగల నేర్పు ఈ గ్రహవాసులకి ఉంది. మరో విషయం ఈ అంగారక గ్రహవాసుల దేహనిర్మాణం పూర్తిగా సెల్యూలోజ్‌తో జరిగింది. సెల్యూలోజ్‌కి వున్న ప్రత్యేకత ఏమిటంటే ఇది ఏ రూపాన్నయినా పొందగలదు. ఏ జీవపదార్థంతోనైనా కలిసిపోగలదు.

వారం రోజులలోనే ఈ అండం పూర్తి ఆకారం చెందిన అంగారక గ్రహవాసిగా మారింది. అప్పుడు అతనికి ఉన్న రూపం, ముందు మనం చూసినట్లుగానే ఉంది. ఎప్పుడైతే అతను పరిపూర్ణుడై చైతన్యాన్ని పొందాడో నా మెదడులోవున్న ఆలోచనలనీ, విజ్ఞానాన్నీ, ఆఖరికి మనభాషనీ కూడా గ్రహించేశాడు. నాతో మాట్లాడాడు. తన కథ అంతా చెప్పాడు. తన జాతిని తిరిగి వృద్ధి చేయాలని తనకున్న సంకల్పాన్ని తెలియజేశాడు. అదెలా సాధ్యం అని నేనడిగిన దానికి రెండు మార్గాలు చెప్పాడు. వారికీ మన మనుష్యులకీ వున్న స్వారూప్యం వల్ల, మన స్త్రీలద్వారా సంతానాన్ని కని వృద్ధిచేయడం ఒకటి. అది వీలుకాకపోతే తన శరీరం నుంచే స్త్రీ అండాలనీ, పురుష బీజాలనీ ఉత్పత్తి చేసి వాటి సంయోగం ద్వారా సంతానాన్ని కని వృద్ధి చేయడం రెండోది. మన జీవ శాస్త్రజ్ఞుల ఊహ ప్రకారం కూడా ఇది సాధ్యమైనట్టిదే. అయితే ప్రస్తుత అంగారక గ్రహం వారికి నివాసయోగ్యంకాదు. వారు వలసపోయిన గ్రహం ముక్కలయిపోయింది. సౌరమండలంలో మరి ఏ ఇతర గ్రహమూ వారికి అనువైనది కాదు. అందువల్ల మన భూమి మీదనే వారి జాతిని వృద్ధి చేయాలన్న ఆలోచన ఉన్నట్లు తెలిపాడు"

"మరి అతనికి నీరూపం ఎలా వచ్చింది? నిన్నూ నన్నూ చంపాలని ఎందుకు చూశాడు?" అంది గీత.

"అదే చెప్తున్నాను. సెల్యులోజ్‌కి ఏ రూపాన్నయినా పొందేశక్తి ఉందని చెప్పాను గదా. అందుకే సులువుగా నా రూపం పొందగలిగాడు. ఇలా చేయడం వల్ల ఒక మానవజాతి మనిషిగా, ఎవరికీ అనుమానం లేకుండా తిరుగుతూ మన విజ్ఞానాన్ని గ్రహించేయవచ్చు. నా మెదడులోని విజ్ఞానాన్ని ఆ విధంగా గ్రహించి నిన్ను గుర్తుపట్టగలిగాడు కూడా. అంటే నా జ్ఞాపకాలను తాను గ్రహించాడన్న మాట. అయితే నాలోని జ్ఞానాన్ని పూర్తిగా గ్రహించడం లేబరేటరీలో సాధ్యంకాదు కనుక నన్ను ఇక్కడికి తీసుకువచ్చాడు.

"మరి ఈ ప్రదేశం గురించి అతనికి ఏమి తెలుసు? ఎలా తెలుసు?" అంది గీత.

"ఆ విషయాలను కూడా నా జ్ఞాపకాలనుంచే గ్రహించాడు. ఇక్కడ ఒకప్పుడు యాసిడ్ ఫ్యాక్టరీ ఉండేది. తర్వాత ఈ కంపెనీ దివాళా తీయడంతో, కోర్టువారు దీనికి సీలువేశారు. ఆ కేసు ఎన్ని సంవత్సరాలకీ

తెగకపోవడంతో, ఇది దయ్యాల కొంపగా మారిపోయింది. సెల్లార్‌లో వున్న యాసిడ్ సీసాలను ఎవరూ గమనించలేదేమో అలాగే ఉండిపోయాయి. అసలు సెల్లార్ ఉన్నట్లే ఎవరూ గమనించి ఉండరు. పైభాగంలో ఉన్న సామాన్లను ఎవరికి అందినవి వారు పట్టుకుపోయారు. ఈ కొంప పాడు బడ్డంతో ఇక్కడికి ఎవరూ రావడం మానేశారు. ఇటువంటి నిర్మానుష్యమైన చోట నా పరిశోధనలు బాగా జరుగుతాయి అనుకుంటుండేవాడిని. ఆ ఆలోచనలను గ్రహించి ఈ ప్రదేశాన్ని ఎన్నుకున్నాడు అతను.

"ఎప్పుడైతే తమజాతిని వృద్ధి చేయాలనుకున్నాడో, వెంటనే నా రూపం పొంది, నన్ను అశక్తుని చేసి బస్తాలోవేసి ఇక్కడి తీసుకువచ్చాడు. నీ మీద నాకు ప్రేమ ఉండడంతో ఆ ఆలోచనల్ని గ్రహించి, నిన్ను ప్రేమించి, నీద్వారా తన జాతిని వృద్ధి చేయాలనుకున్నాడు. నాలోని విజ్ఞానాన్ని పూర్తిగా గ్రహించాక నన్ను, ఈ ప్రపంచంలోని మానవజాతిని అంతటినీ అంతంచేసి, వారి జాతిని ఇక్కడ అభివృద్ధి చేయాలనుకున్నాడు".

"అయితే నిన్నూ, నన్నూ అక్కడ కట్టి పడేసి, ఎక్కడికో ఎందుకు వెళ్ళాడు!"

"నేననుకోడం అతను మళ్ళీ లేబొరేటరీకే వెళ్ళాడు.

అంగారక శిలలో ఇంకా మూడు భరిణలు నాకు కనిపించాయి. వాటిని, కొన్ని పరికరాలను ఇక్కడికి తెచ్చి మిగిలిన వారికి చైతన్యం కలిగించాలనుకొని ఉంటాడు. అతను ఈ స్థలాన్ని ఎన్నుకోవడం మనకి వరప్రసాదమైంది. సెల్యూలోజ్‌కి వున్న మరో లక్షణం, అది వెంటనే యాసిడ్‌లో కరిగిపోతుంది. అది తెలిసి అతనిమీద యాసిడ్ పోయడంతో, అతను కరిగిపోయాడు" అంటూ ముగించాడు ఆనంద్.

"మైగాడ్! ఎంతటి డ్రెడ్‌ఫుల్ ఎక్స్‌పీరియన్స్! ఈ విషయం మనం ప్రకటిద్దామా?" అంది గీత.

"లాభం లేదు. మనం చెప్పేదాన్ని నిరూపించడానికి రుజువు లేవీలేవు. అందువల్ల ఇది కట్టుకథ అని కొట్టిపారేస్తారే కాని ఎవరూ నమ్మరు" అన్నాడు ఆనంద్.

"పోనీలే. ఈ అనుభవం మనిద్దరికే ప్రత్యేకం. సీసాలో బిగిసివున్న దయ్యాన్ని బయటకు తీశావు. ఎలాగైఐతే దాన్ని తిరిగి భూస్థాపితం చేశావు. నువ్వే నిజమైన హీరోవి" అంది గీత.

"నేను హీరో అయితే, నువ్వు హీరోయిన్‌వి." అంటూ ఆప్యాయంగా ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు ఆనంద్.

**ఆంధ్రభూమి సచిత్ర మాసపత్రిక, అక్టోబర్ 1984** ✪